క్లుప్తంగా

బోధ వ్యాధిపై అవగాహన ఏర్పరచుకోవాలి

జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం



తెనాలిఅర్బన్: బోధ వ్యాధిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం సూచించారు. బోధ వ్యాధి నివారణలో భాగంగా బీసీ కాలనీలో శుక్రవారం రాత్రి రక్తపూతల నమోనాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 300 బ్లడ్ శాంపిల్స్‌ను సేకరించడం జరిగిందన్నారు. వీటిని పరీక్షలకు పంపినట్లు చెప్పారు. బోధ వ్యాధి వ్యాప్తి ఏ మేరకు ఉందనేది ఈ పరీక్షల్లో తేల నున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ గుద్దంటి రవికుమార్, మలేరియా అధికారులు శ్రీకంఠ ఉమాకాంత్, వంగాల పున్నారెడ్డి, తిరువీధులు రాంప్రసాద్, మున్నంగి రత్నాకరరావు, షేక్ జబీద్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ



తెనాలిఅర్బన్: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ఆర్ ఎస్ ఫౌండేషన్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో 12,13 వార్డులలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు 50 మందికి శనివారం చినరావూరులో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు రెవరెండ్ పల్లె శ్యామూల్ మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఝాన్సీరాణి, రోహి, ప్రభాకర్, సలోమి, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

జీడీసీసీబీ విశ్రాంత ఏజీఎం మృతి



తెనాలి: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు విశ్రాంత అసిస్టెంట్ జనరల్ మేనేజరు (ఏజీఎం) చెరుకూరి వెంకట సుబ్బారావు (87) శనివారం స్థానిక చినరావూరులోని స్వగృహంలో మృతిచెందారు. వీరికి భార్య ఉన్నారు. స్వస్థలం కొల్లూరు మండల గ్రామం రావికంపాడు. తెనాలి మహాప్రస్థాన సేవా సమితి కార్యవర్గ సభ్యునిగా వ్యవహరిస్తున్నారు. చినరావూరులోని శివాలయం జీర్ణోద్ధరణలో ముఖ్యపాత్ర వహించారు. పలు సేవా కార్యక్రమాలను చేశారు. వీరి అంత్యక్రియలు ఆదివారం ఉదయం చినరావూరు మహాప్రస్థానంలో జరుగుతాయని మహాప్రస్థాన సేవా సమితి కార్యదర్శి జెట్టి శివరామ కృష్ణప్రసాద్ తెలియజేశారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

తెనాలిరూరల్: యువతి అదృశ్యంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొలకలూరుకు చెందిన 24 ఏళ్ల యువతి తెనాలిలోని కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్‌కు రోజు వస్తుంది. ఈ నెల 5వ తేదీన ఇన్‌స్టిట్యూట్‌కు వచ్చిన ఆమె కనబడకుండపోవడంతో కుటుంబసభ్యులు ఆచూకీ కోసం ప్రయత్నించారు. లాభం లేకపోవడంతో టూటౌన్ పోలీసులను ఆశ్రయించగా శనివారం కేసు నమోదైంది.

మద్యం దుకాణాల్లో కల్తీ మద్యం విక్రయం?

తెనాలిరూరల్: తెనాలిలో మద్యం దుకాణాల్లో కల్తీ మద్యం అధికారులు పట్టుకున్నారన్న ప్రచారం శనివారం రాత్రి జోరుగా సాగింది. ఓ మద్యం దుకాణాన్ని నిర్ణీత సమయంలోగానే మూసి వేయడం ఇందుకు మరింత బలాన్ని చేకూర్చింది. తెనాలి మద్యం దుకాణాల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిణి నయనతార ఆధ్వర్యంలో శనివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. సుల్తానాబాద్‌లో లాజ్ విక్రయాలు, స్టేషన్ వద్ద నీళ్ల కలిపినట్టు ఉన్న మద్యాన్ని అధికారుల బృందం గుర్తించిందన్న ప్రచారం జోరుగా సాగింది. దీనిపై ఎక్సైజ్ అధికారులు మాత్రం వివరాలు తెలిపేందుకు విముఖత వ్యక్తం చేశారు. మద్యం పలుచగా ఉందన్న విషయం తెలిసింది మినహా తమకు ఎటువంటి ఫిర్యాదు/సమాచారం లేదని ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్ తెలిపారు.

ట్రైన్‌లో వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

భట్టిప్రోలు: ఈ నెల 5వ తేదీన డెల్టా సూపర్ ఫాస్ట్ ట్రైన్‌లో భట్టిప్రోలు రైల్వే స్టేషన్‌లో ఎక్కిన 42 సంవత్సరాల వయస్సు కలిగిన బండి వీర శంకర్ తెనాలి రైల్వే స్టేషన్ దాటిన తరువాత ఆచూకి తెలియలేదని కుటుంబ సభ్యులు తెనాలి జీఆర్పీ ఎస్ఐ జి.వెంకటాద్రికి శనివారం ఫిర్యాదు చేశారు. 5 అడుగుల 4 అంగుళాల ఎత్తు, నలుపు, తెలుపు, ఫుల్ గడ్డం, ఎర్రటి ఛాయ కలిగి ఉంటాడని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్ఐ తెలిపారు.

మాలధారణం... నియమాల తోరణం

- అయ్యప్ప దీక్షపై ఆసక్తి చూపుతున్న యువత
- 41 రోజులు కఠిన నియమాలతో దీక్షలు
- ఆధ్యాత్మికంతో పాటు ఆరోగ్యం
- మండలంలో ఏటా 500 మందికి పైగా మాలధారణ



కొల్లిపరలో అయ్యప్ప మాలధారణ స్వీకరించిన భక్తులు

కొల్లిపర: శివకేశవుల తనయుడైన శ్రీమణికంఠుని మాలధారణ నియమ నిష్ఠలతో కూడుకున్నది కార్తిక మాసం మొదలు మకర సంక్రాంతి వరకు ఈ దీక్షాధారణ ప్రారంభమవుతాయి. దీంతో కోలాహలంగా ప్రతి గ్రామంలో చిన్న పిల్లలు దగ్గర నుంచి పెద్ద వయసు వరకు ఉన్న వారు అయ్యప్ప దీక్షలు స్వీకరించి ఎక్కువ శాతం కనిపిస్తారు. కొల్లిపర మండలంలో ఏటా 500 మందికి పైగా అయ్యప్పస్వామి మాల స్వీకరిస్తున్నారు. వీరిలో ఎక్కువగా కన్య స్వాములు 100 మంది వరకు ఉండటం విశేషం

మాలధారణలో నియమాలు ఇలా

అయ్యప్ప మాలను ఆలయంలో గురుస్వామి వద్ద లేదా ఇంట్లో మాతృమూర్తి వద్ద వేయించుకోవచ్చు. 41 రోజులల్లో ప్రతి రోజు సూర్యోదయానికి ముందే చన్నీటి స్నానం, విభూది, చందనం, కుంకుమ, నల్లనివస్త్రధారణతో అలంకరించుకొని స్వామి వారికి పూజలు చేయాలి, అలాగే సూర్యాస్తమయం తర్వాత పూజలు నిర్వహించాల్సి ఉంటుంది. 41 రోజుల పాటు కఠిన నియమాలు పాటించాలి. రాత్రి వేళల్లో ఎక్కువగా ఆలయాల్లోనే నిద్రకు ఉపక్రమించడం శ్రేయస్కరం.

ఇరుముడి ప్రాధాన్యత

అయ్యప్ప దీక్షలో ఇరుముడికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఇందులో రెండు ముడులు ఉంటాయి. ముందున్న ముడిలో అయ్యప్ప స్వరూపమైన ముద్ర, కొబ్బరికాయ స్వామికి సమర్పించే వస్తువులను ఉంచుతారు. కొబ్బకాయను నేతితో నింపుతారు. నెయ్యి జ్ఞానానికి ప్రతీకగా చెబుతుంటారు. కొబ్బరికాయకు బిగించే కార్క్‌ను వైరాగ్యానికి చిహ్నంగా భావించి మూతపెడుతారు. ఆపైన కాయకు ఆత్మ అనే లక్కతో సీలు వేస్తారు. జ్ఞానం అనే నెయ్యితోనే అయ్యప్పకు అభిషేకం చేస్తారు.

దీక్షతో సంపూర్ణ ఆరోగ్యం



41 రోజులు కఠిన నియమాలతో దీక్ష చేయడం, సమయం లోపే ఆహారాన్ని స్వీకరించడం వలన భక్తితో పాటు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుంది, ఒక్కపూట శాఖాహార భోజనం స్వీకరించడం సమతుల్యత పాటించడంతో జీర్ణక్రియ చక్కబడుతుంది. భక్తిభావం పెరుగుతుంది. ఈ 41 రోజులు కఠిన నియమాలతో చేసిన దీక్షల వలన సంవత్సరాంతం ఇదే ఒరవడి కలిగి ఉండటానికి ఉపయోగపడుతుంది.

–బొంతు వెంకటరెడ్డి (దత్తు స్వామి)

ఏటా అయ్యప్ప దీక్ష చేస్తున్నా



ప్రతి సంవత్సరం అయ్యప్ప దీక్ష చేపడుతున్నా. కరోనా కాలంలో కూడా శబరిమలైకు వెళ్లి స్వామివారిని దర్శించుకున్నా. గత 15 సంవత్సరాలుగా డిసెంబర్ మొదటి వారంలో గ్రామంలో కొంత మందితో కలసి అయ్యప్ప మాల ధరించి దీక్షలు చేపడుతున్నా. పలుగ్రామాల్లో భజనలు, అన్నదానం, అంబలం పూజలు చేసి 41రోజు గ్రామంలోని 40 మంది అయ్యప్ప భక్తులతో వెళ్లి దర్శనం చేసుకుంటున్నా. చాలా సంతోషంగా ఉంది.

–భీమవరపు రాజశేఖరరెడ్డి, కొల్లిపర

నిబద్ధతగల యోధుడు పరుచూరి

వర్ధంతి సభలో ప్రజాసంఘాల నేతల నివాళి



నివాళి అర్పిస్తున్న నాయకులు

తెనాలి: తెనాలికి చెందిన ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు పరుచూరి నాగేశ్వరరావు వర్ధంతిని శనివారం స్థానిక చెంచుపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సీపీఎం తెనాలి కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్ మాట్లాడుతూ, కమ్యూనిస్టు ఉద్యమంలో జిల్లా నాయకులు కీలకపాత్ర పోషించారనీ, కమ్యూనిస్టుల నాయకత్వంలో కష్టజీవుల పోరాటాలెన్నో జరిగాయని చెప్పారు. పదిహేనేళ్ల వయ సులోనే పరుచూరి నాగేశ్వరరావు యువజన సంఘం కార్యకలాపాల్లో క్రియాశీలకపాత్రను పోషించారని గుర్తుచేశారు. ఇంటర్‌లోనే పార్టీ సభ్యత్వం తీసుకుని పాలెర్లు, వ్యవసాయాకూలీల సమ్మె కు నాయకత్వం వహించినట్టు చెప్పారు. తెలంగాణా సాయుధ పోరాటంలోనూ పాల్గొని, కాల్చివేత ఉత్తర్వులతో మూడేళ్లు రహస్య జీవితం గడిపినట్టు తెలిపారు. 1962, 1974లో రెండుసార్లు జైలు జీవితం గడిపారని చెప్పారు. దీర్ఘకాలం తెనాలిడివిజన్ కార్యదర్శిగా, జిల్లా కమిటి కార్యదర్శివర్గభ్యులుగా బాధ్యతలు నిర్వహించిన నాగేశ్వరరావు, నమ్మిన సిద్ధాంతం కోసం చివరివరకూ పనిచేశారని వివరించారు. రైతుసంఘంజిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ సాహిత్యంతోపాటు సమాజాన్నీ నాగేశ్వరరావు అధ్యయనం చేశారని చెప్పారు. శ్రమజీవుల కోసం ఎన్నో పోరాటాల్లో పాల్గొన్నారని తెలిపారు.

దాల్‌మిల్ ముఠా కార్మిక సంఘం నాయకులు ఎ.వెంకటసుబ్బయ్య, కె.శ్రీనివాసరావు, పోస్టల్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకుడు పి.జోసేఫ్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు మంగళగిరి వెంకటేశ్వర్లు, ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకుడు కె.దుర్గాప్రసాద్, మహిళా సంఘం నాయకురాలు ఎస్.రాజ్యలక్ష్మి సీఐటీయూ నేత షేక్ హుస్సేన్‌వలి పాల్గొన్నారు. తొలుత నాగేశ్వరరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీదేవి

తెనాలిఅర్బన్: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని గుంటూరులోని కిమ్స్ శిఖర హాస్పటల్స్ పలమనాలజిస్ట్ డాక్టర్ శ్రీదేవి పేర్కొన్నారు. బుర్రిపాలెం రోడ్డులోని ఎన్ఆర్‌కె అండ్ కెఎస్ఆర్ గుప్తా ఫార్మసీ కళాశాలలో సీజనల్ వ్యాధులపై శనివారం అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చలికాలంలో దగ్గు, జలుబు, పెద్దవారిలో ఆస్తమా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. తగు జాగ్రత్తలు తీసుకుంటే వాటిని నియంత్రించవచ్చని చెప్పారు. సమావేశంలో డాక్టర్ స్రవంతి, డాక్టర్ ముక్తార్ అహ్మద్, పీజీ కళాశాల ప్రిన్సిపల్ చంద్రకళ, శ్రీ పొట్టి శ్రీరాములు ఎడ్యుకేషనల్ సొసైటీ మేనేజర్ శ్రీనివాసరావు, డాక్టర్ షారోన్ లిల్లీ, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ దుర్గారావు, వల్లి పద్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్య షష్టి



కల్యాణోత్సవంలో పాల్గొన్న రాజేంద్రప్రసాద్

తెనాలిరూరల్: మండల పరిధిలోని పెదరావూరు శివారులో గల శ్రీ సుబ్రహ్మణ్య క్షేత్రంలో వేంచేసి ఉన్న శ్రీ ఆదిశంకరాచార్య సహిత శ్రీఅభయ హస్త సుబ్రహ్మణ్యస్వామి దేవస్థాన నాలుగో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సుబ్రహ్మణ్య షష్ఠిని పురస్కరించుకుని శనివారం స్వామి వారికి విశేష అభిషేకాలు ప్రత్యేక అలంకరణలు చేశారు. శ్రీ మహా విద్యాపీఠంలోని శ్రీ పరమాచార్య మండపంలో శ్రీ విద్యా సాంప్రదాయ వేదికపై శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. సుబ్రహ్మణ్య క్షేత్ర నిర్వాహకులు సుబ్రహ్మణ్య శర్మతో పాటు చింతపల్లి దత్తు శర్మ, శుభం శర్మ, రామకృష్ణ, నరసింహమూర్తి పూజాది క్రతువులను నిర్వహించారు. స్వామి వారి కళ్యాణ మహోత్సవంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాధవి దంపతులు పాల్గొన్నారు. గ్రామ నాయకుడు పాలడుగు సురేంద్ర, కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి, సినీ కథా రచయిత బుర్రా సాయిమాధవ్ గోపి. స్థానిక నాయకులు. స్వామి వారి భక్తులు శ్రీ మహా విద్యాపీఠం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి



విద్యార్థులను అభినందిస్తున్న ఎంపీపీ పద్మావతి

కొల్లిపర: పాఠశాల అభివృద్ధిలో గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు భాగస్వామ్యం కలిగి ఉంది విద్యార్థుల ఎదుగుదలకు సహకారాలు అందించాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని వివిధ గ్రామాలల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు మెగా పేరెంట్స్–టీచర్స్ మీట్ కార్యక్రమంలో ఆయా పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలోని మౌలిక వసతులు పరిశీలించి, పాఠశాలలోని మధ్యాహ్న భోజనం కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పద్మావతి మాట్లాడుతూ ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలు ఇంటి వద్ద చదువుతున్నారా లేదా , పాఠశాలలో ఏవిధంగా నడుచుకుంటున్నారు అన్న అంశాలను నిత్యం గమనిస్తూ ఉండాలని సూచించారు. పలు పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు, విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వి.విజయలక్ష్మి,ఎస్ఐ పి.కోటేశ్వరరావు, ఆయా గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రేడ్ల కోసం విద్యార్థులపై ఒత్తిడి తగదు

మెగా పీటీఎంలో తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ



తల్లిదండ్రుల అభిప్రాయాలను వింటున్న సబ్‌కలెక్టర్ సంజనా సింహ

తెనాలి: పరీక్షల్లో గ్రేడ్ల కోసం విద్యార్థులపై తల్లిదండ్రులు ఒత్తిడి తేవొద్దని తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ సూచించారు. పదోతరగతి వరకు తల్లిదండ్రులే పిల్లలకు రోల్‌మోడల్స్‌గా చెబుతూ, ప్రతిరోజూ కొంతసమయం స్నేహపూర్వకంగా గడపాలని, వారి ఆసక్తులను గమనించి తగినవిధంగా ప్రోత్సహించాలని చెప్పారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పిల్లల ఆత్మీయ సమావేశం (మెగా పీటీఎం) శనివారం స్థానిక కొత్తపేటలోని దొడ్డపనేని ఇందిర మున్సిపల్ బాలికల హైస్కూలులో నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి డాక్టర్ మేకల లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. సబ్‌కలెక్టర్ సంజనా సింహ మాట్లాడుతూ పాఠ్యపుస్తకాల చదువుకు ప్రాధాన్యతనిచ్చేలా చూడాలనీ, పుస్తక పఠనంతో కూడా మానసిక వికాసం, జ్ఞానం అలవడతాయని చెప్పారు. పుస్తక పఠనం సామర్థ్యం లేని విద్యార్థులు పోటీపరీక్షలను ఎదుర్కోలేరని అన్నారు. మేథ్స్, ఇంగ్లిష్‌పై దృష్టి పెట్టాలనీ, పెద్దలు ఇంట్లోనూ ఇంగ్లిష్‌లో మాట్లాడటం మంచిదని సూచించారు. విద్యార్థుల మధ్య పోటీతత్వం, స్నేహభావం ఉండాలన్నారు, రోజూ ఇంటికొచ్చాక తరగతి పాఠాలను పునశ్చరణ చేసుకోవటం మంచిదన్నారు. శారీరక వ్యాయామం కూడా ఉండేలా చూడాలన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ మాట్లాడుతూ విలువల ఆధారిత విద్య కావాలని సూచించారు. ప్రభుత్వ నిర్ణయాలతో విద్యాబోధనలో మార్పులను గమనించాలని చెప్పారు. పిల్లలను వారి అభిరుచుల మేరకు ప్రోత్సహించాలని చెప్పారు. ప్రధానోపాధ్యాయిని శాఖమూరి రాజ్యలక్ష్మి, దాతలు మువ్వా సత్యనారాయణ, వెంకట కమలకుమారి, డాక్టర్ పావనీ ప్రియాంక, విశ్రాంత ఉపాధ్యాయిని మంజులవాణి, విద్యాకమిటి చైర్మన్ మానేపల్లి లక్ష్మీశైలజ, ఎంఈవో–2 జయంత్‌బాబు మాట్లాడారు.

అధ్యాపకురాలు డాక్టర్ అరుణకు సత్కారం



అరుణకుమారి సత్కారం

తెనాలి: పట్టణ అయితానగర్‌కు చెందిన అధ్యాపకురాలు వట్టిప్రోలు అరుణకుమారికి అంతర్జాతీయ గురుగౌరవం లభించింది. దుబాయ్ తెలుగు సంఘాల ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం దుబాయ్‌లోని కాప్రాన్ స్టార్ హోటల్ ఆడిటోరియంలో 'స్పందన వెల్నెస్ వేవ్స్' కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. ఇదా ఫౌండేషన్ ఇంటర్నేషనల్ చైర్మన్ ఇదా శామ్యూల్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఆస్కా చైర్మన్ / మోటివేటర్ డాక్టర్ బాలచందర్ సాదే అతిథిగా పాల్గొన్నారు. ఇదే వేదికపై అధ్యాపకురాలుగా అంకితభావం, నిబద్ధతతో వృత్తిజీవితం గడుపుతున్న వట్టిప్రోలు అరుణకుమారిని 'ఇంటర్నేషనల్ ఎక్స్‌లెన్స్' అవార్డు తో ఘనంగా సత్కరించారు. జీవిత విలువలు, యు వత సాధించాల్సిన విజయాలు, క్షణికావేశంలో యు వత తీసుకునే నిర్ణయాలు, ఆత్మహత్యలు లేని సమాజాన్ని కాంక్షిస్తూ అతిథులు మాట్లాడారు. దుబాయ్ వైద్యులు డాక్టర్ దీప, డాక్టర్ మయం, తెలుగు సంఘా ల కోఆర్డినేటర్ త్రిమూర్తులు, ఏమిరేట్ తెలుగు సంఘాల అధ్యక్షుడు కిరణ్ కుమార్, దృత డెవలపర్స్ సీఈవో రత్నబాబు, స్పందన డైరెక్టర్ చంద్రిక రెడ్డి, అంజు రెడ్డి, ఈదా శామ్యూల్ రెడ్డి, కార్యవర్గం అరుణ కుమారిని అభినందించారు. అరుణకుమారి నరసరావుపేటలోని బీఎడ్ కాలేజీలో అధ్యాపకురాలుగా చేస్తున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో పేరెంట్స్ మీట్



పెదరావూరు జెడ్పీ హైస్కూల్లో ఎంపీటీఎంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, తలిదండ్రులు



మాట్లాడుతున్న ఎస్ఐ కోటేశ్వరరావు

తెనాలిరూరల్: మండలంలోని పెదరావూరు జెడ్పీ హైస్కూలులో ప్రధానోపాధ్యాయురాలు పి. సరళ ఆధ్వర్యంలో ఎంపీటీఎం నిర్వహించారు. తలిదండ్రులకు టగ్ ఆఫ్ వార్, ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కాకి రమాదేవి, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ పి. వేణుబాబు, ఈదర వెంకట పూర్ణచంద్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగలకుదురులో..

అంగలకుదురు సజ్జన్నపేటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎంపీటీఎం నిర్వహించారు. తల్లులకు ముగ్గుల పోటీలు, తండ్రులకు టగ్‌ఆఫ్ వార్ పోటీలు పెట్టారు. ఎంఈవోలు మేకల లక్ష్మీనారాయణ, వి. జయంతి బాబు బహుమతులను అందజేశారు. గ్రామ సర్పంచ్ రాజ్యలక్ష్మి, పాఠశాల వ్యవస్థాపకుడు జోసఫ్ కుమారుడు చిలకా జాన్ వరప్రసాదరావు, ఉపాధ్యాయులు పావని, శాంతి, గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

తూములూరు(కొల్లిపర): విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్, గంజాయి, అమ్మినా, సేవించినా చట్టప్రకారం నేరమని అటువంటి వారిపై చట్టపరమైన కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పి.కోటేశ్వరరావు హెచ్చరించారు. శనివారం మండలంలోని తూములూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్–టీచర్స్ మీట్ కార్యక్రమం అనంతరం పోలీస్ శాఖ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు డ్రగ్స్ వద్దు బ్రో అనే కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు డ్రగ్స్, మత్తు పదార్థాలు వలన జీవితంలో ఏమి కోల్పోతున్నాం , వీటిపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటుంది అన్న అంశాలపై అవగాహన కల్పించారు ప్రతి కుటుంబంలో యుక్తవయసులో ఉన్న తమ పిల్లలు బయటకు వెళ్లి ఏ పనులు చేస్తున్నారు, వారి నడవడిక ఏవిధంగా ఉంది, రాత్రి సమయంలో ఎన్నిగంటకు ఇంటికి వస్తున్నారు అన్న అంశాలను నిత్యం పరిశీలిస్తూ ఉండాలన్నారు. ఏ కొంచెం తేడా అని పించిన వెంటనే వారిని ప్రశ్నించాలన్నారు. వారిని మంచి మార్గంలో పెట్టడానికి కృషి చేయాలని, అప్పటికీ మీ మాట వినకపోతే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందిస్తే అటువంటి వారికి ప్రత్యేక కౌన్సెలింగ్ అందిస్తామని వివరించారు.

తెనాలిలో....

తెనాలి: రూరల్ మండల గ్రామం కొలకలూరులోని జిల్లాపరిషత్ హైస్కూలులో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. తెనాలి ఎంపీడీవో అత్తోట దీప్తి, రూరల్ ఎస్ఐ ప్రతాప్‌కుమార్, ఎంఈఓ లక్ష్మీ నారాయణ గ్రామ సర్పంచ్ డాక్టర్ అశోక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హిమబిందు, కొలకలూరు గ్రామ మహిళా పోలీసులు జి.ప్రగతి, ఎం.మల్లిక, స్కూల్ చైర్మన్ షేక్ జిలాని పాల్గొన్నారు. 'డగ్స్ వద్దు', 'బాల్యవివాహ రహిత ఆంధ్రప్రదేశ్'పై ప్రతిజ్ఞ చేయించారు.

లూథరన్ అప్పర్ ప్రైమరీ స్కూలులో..

తెనాలి: పట్టణ నాజరుపేటలోని లూథరన్ అప్పర్ ప్రైమరీ స్కూలులో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆత్మీయ సమావేశం జరిగింది. ప్రధానోపాధ్యాయిని పీఆర్ ప్రియదర్శిని అధ్యక్షత వహించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎంవీ రఘునాధరావు మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలతో బాధ్యతతో మెలగుతామని ఎం.నాగలక్ష్మి ప్రమాణం చేయించారు. అనంతరం క్రీడాపోటీలు జరిపారు. సీహెచ్ విజయసారధిబాబు, జె.శశికళ మాట్లాడారు. ముందుగా తల్లిదండ్రుల అభిప్రాయాలను తెలుసుకున్నారు.

ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దండి

తెనాలిఅర్బన్: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందని మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు పేర్కొన్నారు. 15వ వార్డులోని వాసిరెడ్డి లక్ష్మిపతి మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌లో శనివారం తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కౌన్సిలర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిషు మీడియం విద్యాబోధనను ఏర్పాటు చేశారని తెలిపారు.

- సాలీపేటలోని స్పెషల్ మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన వివిధ పోటీల్లో తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ సభ్యులు కిక్కురిచిన్న కృష్ణారెడ్డి సహకారంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు స్వీటు, హాట్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ వ్యవస్థాపకులు కాకరపర్తి సుబ్రమణ్యం, డాక్టర్ కొత్తపల్లి రాజ్‌కుమార్, నంబూరి శ్రీకుమార్, హెచ్ఎం కాట్రగడ్డ భాగ్యలక్ష్మి, పొన్నూరు అరుణ, ఆర్.నగ రాజకుమారి, డి.శైలజ, టి.సురేష్ బాబు, టి.వెంకట కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



తల్లిదండ్రులకు మిఠాయి పంపిణీ చేస్తున్న కృష్ణారెడ్డి, సుబ్రమణ్యం



మాట్లాడుతున్న ఎంపీడీవో అత్తోట దీప్తి



విద్యార్థులతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

వేలం ప్రకటన

మహారాష్ట్ర తెనాలి అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P.No:10/2020 in OS.No:54/2017
Between:-
Singamsetty Rama Venkata Krishna Prasad - DHR
And
Saragapali Hanumantharao
Saragapali Suvarchala Devi - JDR
[illegible]
ఆస్తుల : Guntur district-Tenali Sub-district - Tenali Muncipal-8th ward-10th block- T.S. No.521/7 Ac.1-43 cents T.S.No521/1 Ac.0-98 cents both two numbers combined single plot out of it an extent of 70sq.yards or 59-52sq.meters site with RCC daba house with a plinth area of 296Sq.feet, bearing door No.1-27-17, Nazarpet, Tanksalavari street, Tenali bounded by East: 5feet width passage site -18'-0, South: wall belonging to vejandla satyanarayana-35'-0 West: joint passage site of Upadrista Anasuryamma and others-16'-0, North: Site belonging to Bhagavathula Srinivasa Sastry-35'-0
DHR Value Rs.17,00,000/-
Amina Value Rs.25,00,000/-
Sale Date: 26-12-2024, Further H-2-1-2025
Note: [illegible] JDR Vistaar Financial Services Pvt Guntur Branch [illegible]

V.RAMESH BABU, R.DAYA KIRAN
DHR తరుపు న్యాయవాదులు
తెనాలి. సెల్ : 9966255449

రబీ సీజన్‌కు సాగునీరు వచ్చే అవకాశం లేదు

చెరుకుపల్లి: మండలంలో రబీ సాగుకు నీరు వచ్చే అవకాశం లేదని రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి టి.బాలాజీ గంగాధర్ శనివారం తెలిపారు. వెల్లటూరు చానల్ మరామ్మతులు జరుగుతున్నందున రెండవ పంటకు సాగు నీరు వచ్చే అవకాశం లేదని రైతులు జొన్న, మొక్కజొన్న వంటివి కాకుండా ఆరుదల పంటలైన మినుము, పెసర వంటి పంటలు వేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మండలంలోని గూడవల్లి, కనగాల, ఆరేపల్లి గ్రామాల పరిధిలో జొన్న, మొక్కజొన్న పంటలు సాగుచేసే రైతుల పరిస్థితిని గమనించి నీరు వచ్చే అవకాశం లేదు గనుక అపరాలు సాగు చేసుకోవాలని తెలిపారు.

చివరి హెచ్చరిక

మంగళగిరి నగర పరిధిలో ఆవులను వదిలితే కఠిన చర్యలు తీసుకుంటామని మంగళగిరి తాడేపల్లి నగర కమిషనర్ ఆలీం బాషా శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. యజమానులు వెంటనే తమ ఆవులను సంరక్షించుకోవాలని, రోడ్లపై వదిలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.